క్లుప్తంగా

అలరించిన ఘంటసాల స్వర నీరాజనం



ఘంటసాల స్వరనీరాజనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఘంటసాల స్వరపీఠం ఆధ్వర్యంలో మాతృదినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక వైఎంహెచ్ఏ హాలులో నిర్వహించిన మాతృమూర్తికి స్వరనీరాజనం పేరుతో నిర్వహించిన ఘంటసాల స్వరనీరాజనం కార్యక్రమం ఆద్యంతం ప్రేక్షకులను విశేషంగా అలరించింది. స్వరపీఠం అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వర రావు మాతృమూర్తి ఆలపాటి కమలావతి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెబ్ అదనపు సూపరింటెండెంట్ ఎన్. సూర్యచంద్రరావు, తపన ఫౌండేషన్ చైర్మన్ గారపాటి చౌదరి, మారుబోయిన కోటేశ్వర రావు, చోడగిరి శ్రీనివాస్, ఆర్ఎస్ హరనాథ్, కేఏ రనామరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాయకులు లంకా వెంకటేశ్వర్లు, ఈటి అర్జున రావు, శ్రీవల్లీ సరస్వతి, శ్రావణి, మేర్నీడి మాధురి, శర్వాణి, కే. చిరంజీవి, సుకన్య, పి.సూర్యప్రకాష్ తదితరులు తమ గాత్ర మాధుర్యంతో ఆకట్టుకున్నారు.

లౌకికవాద పరిరక్షణకు కృషి చేయాలి



తానా రామారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

ఏలూరు (టూటౌన్): దేశంలో లౌకిక వాద పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు పిలుపు నిచ్చారు. స్థానిక తిలక్ నగర్‌లో సీనియర్ కమ్యూనిస్టు తాన రామారావు(విశాలాంధ్ర రాము) సంస్మరణ సభ సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. చైతన్య వేదిక ఏలూరు అధ్యక్షులు ప్రముఖ న్యాయవాది పీఎస్ చందు అధ్యక్షతన జరిగిన సభలో పలువురు నాయకులు రామారావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. న్యాయవాది పీపీ శాస్త్రి, రిటైర్డ్ జడ్జి అడబాల లక్ష్మి సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, న్యాయవాది వాకాడ రాజారావు, బట్టా మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన తాగునీటి ప్రణాళిక

- వేసవిలో సైతం నిర్విరామంగా తాగునీటి సరఫరా
- రూ.10 కోట్లతో 9 ఓవర్ హెడ్ ట్యాంకులు



నిండుగా ఉన్న చాటపర్రు తాగునీటి చెరువు



చాటపర్రు ఫిల్టర్‌బెడ్లు బాగు చేస్తున్న కూలీలు(ఫైల్)



మల్కాపురంలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్

ఏలూరు రూరల్: ఏలూరు మండలంతో పాటు దెందులూరు నియోజకవర్గ గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టిన తాగునీటి ప్రణాళిక ఫలించింది. వేసవిలో సైతం గ్రామీణ ప్రజలందరికీ తాగునీరు సరఫరా జరుగుతోంది. గత ప్రభుత్వ హాయాంలో వేసవికాలం వచ్చిందంటే పల్లె ప్రజలు తాగునీటి కోసం గగ్గోల పెట్టేవారు. వీధి చివర పంపులు వద్ద మహిళలు పడిగాపులు పడేవారు. ట్యాంకుల వద్ద తోపులాడుకునేవారు. నేడు పరిస్థితి మారింది. ప్రభుత్వం ప్రతి ఊరులో ఒక ట్యాంక్, కొత్త పైప్‌లైన్, ఇంటికో కుళాయి ఏర్పాటు చేసింది. గ్రామాధికారులు ముందుగానే తాగునీటి చెరువులు నింపారు. ఫిల్టర్‌బెడ్లు బాగు చేశారు. ఫలితంగా నిర్విరామంగా తాగునీరు సరఫరా అవుతోంది.

పక్కా ప్రణాళిక

ప్రభుత్వం కృషితో మండలం మొత్తం తాగునీటి సరఫరా విభాగం మెరుగుపడింది. రెండేళ్ల క్రితం అధికారులు రూర్బన్ పథకం ద్వారా రూ.10 కోట్ల రూపాయలతో తాగునీటి వ్యవస్థను అభివృద్ధి చేశారు. మాదేపల్లిలో రూ.80 లక్షలతో పూర్తి చేసిన 200 లీటర్ల సామర్థ్యం ఉన్న ట్యాంకు కట్టారు. మల్కాపురంలో రూ.40 లక్షలతో 90 కేఎల్ ట్యాంకు, శ్రీపర్రు, గుడివాకలంక 60 కేఎల్ ట్యాంకులు మరో రెండు ట్యాంకులు అందుబాటులోకి తెచ్చారు. మహేశ్వరపురం, తిమ్మారావుగూడెం, కలకుర్రులో రూ.44 లక్షలు వెచ్చించి మూడు ట్యాంకులు నిర్మించారు. చాటపర్రు, కాట్లంపూడి, కోటేశ్వర దుర్గాపురంలో సైతం మూడు 40 కేఎల్ ట్యాంకులు పూర్తి చేశారు. ఇదే క్రమంలో రూ.2 కోట్ల 37 లక్షలతో ప్రత్తికోళ్లలంక, మాదేపల్లి, కోటేశ్వదుర్గాపురంలో సీపీడబ్ల్యూఎస్ ట్యాంకు నుంచి సుమారు 20 కిలోమీటర్ల కొత్త పైప్‌లైన్ వేసి ఇంటింటికీ కుళాయి అందించి ప్రజల దాహార్తి తీర్చారు.

మోటర్లతో కొంత మేర సమస్య

రూ.30 లక్షలతో కొత్త పైప్‌లైన్ వేసినప్పటికీ గ్రావెటీ లేక మొండికోడు రిజర్వాయర్ నుంచి సరిపడా నీరు అందడం లేదంటూ పెదయాగనమిల్లి, కోమటిలంక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరఫరా సమయంలో మోటార్లు వేయడం వల్ల నీరు అందడం లేదంటూ జాలిపూడి, ప్రత్తికోళ్లలంక శివారు ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అధికారులు స్పందించాలి



గ్రామ ప్రజల కోరిక మేరకు స్థానిక ఎమ్మెల్యే రూ.30 లక్షలతో కొత్త పైప్‌లైన్ వేయించారు. గ్రావిటీ లేకపోవడం వల్ల రిజర్వాయర్ నుంచి మా గ్రామానికి నీరు చేరడం లేదు. సమస్య పరిష్కరించమని ఎమ్మెల్యే చెప్పారు. అయినా అధికారులు సమస్య పరిష్కరించడం లేదు. గత్యంతరం లేక ప్రజలు తాగునీరు కొంటున్నారు.

– తెనాలి యోహాన్, సర్పంచ్, కోమటిలంక

ఎమ్మెల్యే కృషి ఎంతో ఉంది



ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషి వల్ల 15 గ్రామాల ప్రజల తాగునీటి సమస్యకు శాస్వత పరిష్కారం చూపారు. మాదేపల్లి, చాటపర్రులో ఫిల్టర్ బెడ్లు బాగు చేశాం. మహేశ్వరపురంలో రూ.4.50 లక్షలతో కొత్త బోరు వేస్తున్నాం. గుడివాకలంక ప్రజలకు 15 ఎకరాల్లో చెరువు తవ్వించాం. మండలంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రాబోయే 20 ఏళ్ల వరకూ తాగునీటి సమస్య రాకుండా ప్రణాళిక రూపొందించి అమలు చేశారు.

– పెనుమత్స శ్రీనివాసరాజు, ఎంపీపీ

అంజుమన్ సంస్థ సేవలు అభినందనీయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం సంస్థ దశాబ్దాలుగా నగరంలోని ముస్లింలతో పాటు ఇతర మతాలకు చెందిన వారికి సైతం ఎన్నో సేవాకార్యక్రమాలు కొనసాగిస్తుండడం అభినందనీయమని ఏలూరు నగరపాలక సంస్థ కో– ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. అంజుమన్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అంజుమన్ హాలులో ఏర్పాటు చేసిన ఉచిత సున్తీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ముస్లిం పిల్లలు 200 మందికి ఉచితంగా సున్తీలు నిర్వహించిన అంజుమన్ సంస్థ ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు. సుమారుగా రూ. 3 లక్షల ఖర్చుతో జిల్లా నలుమూలలు నుండి వచ్చిన 2 వందల మంది పేద ముస్లింలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్నారన్నారని, క్యాంపునకు వచ్చిన వారికి భోజనం, పాలుతోపాటు గాయం మానేవరకు ఉచితంగా మందులు ఇస్తున్నారన్నారు. అంజుమన్ సంస్థకు ఉన్న ఆస్తుల్లో శిథిలావస్థలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ను రూ. 1.50 కోట్ల వ్యయంతో 26 షాపులు నూతనంగా నిర్మించారన్నారు. వాటిపై వస్తున్న ఆదాయంతో ప్రతిరోజు పేదలకు ఉచిత వైద్య సహాయం అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా అంజుమన్ సంస్థ అధ్యక్షులు సులేమాన్ మాట్లాడుతూ తమ సంస్థకు ఉన్న ఆస్తులను కాపాడుకుంటూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, తమ సేవా కార్యక్రమాలకు పెదబాబు సహకారం ఎల్లప్పుడూ ఈ విధంగానే ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ ప్రధాన కార్యదర్శి అమీర్ జానీ, 46వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ ఇలియాస్ పాషా, ఎండీ ఎక్బాల్, మాజీ అధ్యక్షుడు ఎస్ఎం అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా రెజ్లర్లకు సంఘీభావంగా కొవ్వొత్తుల ర్యాలీ



మహిళా రెజ్లర్లకు సంఘీభావంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

ఏలూరు (టూటౌన్): ఢిల్లీలో ఆందోళన చేస్తున్న మహిళా రెజ్లర్లకు సంఘీభావంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక పవరుపేటలోని ఐద్వా కార్యాలయం నుంచి పాతబస్టాండ్ వరకూ ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల నాయకులు పి.హైమావతి, యామిని, వాణి, వరలక్ష్మి లు మాట్లాడుతూ మహిళలను వేధించిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేసి కమిషన్ ఇచ్చిన నివేదికన బయట పెట్టాలని కోరారు. న్యాయం కోసం పోరాటం చేస్తున్న మహిళా రెజ్లర్లుకు దేశంలోని యావత్ మహిళా లోకం సంఘీభావం తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జి.స్వాతి,మేతర అజయ్ బాబు, కె.లెనిన్, ఉషా, స్వాతి, భవానీ,శివ కుమారి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమద్ జయంతి వేడుకలు



దొండపాడు దత్తక్షేత్రంలో కార్యసిద్ధి ఆంజనేయ స్వామి వారికి విశేష పూజలు నిర్వహిస్తున్న భక్తులు



రామకోటి శ్రీరామ మందిరంలో ప్రత్యేక అలంకరణ



మామిడి పండ్లతో విశేష అలంకరణలో ఆంజనేయ స్వామి



ఏలూరులో హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న యువకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హనుమద్ జయంతి పర్వదినం సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో, ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక దొండపాడు శ్రీనం దత్తనాథ క్షేత్రంలో వేంచేసియున్న శ్రీ కార్యసిద్ధి ఆంజనేయ స్వామి ఆలయంలో సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 6.30 గంటల నుంచి గణపతి పూజ, పుణ్యాహవాచన, మండపారాధన, సహస్ర కలశ స్థాపన, వారుణానువాక పారాయణ, నమక క్రమార్చన, శ్రీరామ షడక్షరీ మంత్ర సహిత అంజనేయ మూలమంత్ర హోమం, పూర్ణాహుతి, కలశోద్వాసన పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 11.30 గంటల నుంచి కార్యసిద్ధి ఆంజనేయ స్వామి వారికి మహాస్నపన, విశేష అలంకరణ, అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి స్వామి వారి ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు.

రామకోటి శ్రీరామ మందిరంలో..

స్థానిక రామకోటిలోని శ్రీరామ మందిరంలో హనుమద్ జయంతి పర్వదినం సందర్భంగా ఉదయం 8 గంటలకు శ్రీ ఆంజనేయ స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు స్వామి వారికి ఆకుపూజ, గంధ సింధూరంతో అష్టోత్తర పూజ, ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్, భాగ్యలక్ష్మి దంపతులు మద్ జిగ వితరణ చేశారు. సాయంత్రం 5 గంటల నుంచి హనుమాన్ చాలీసా పారాయణ, 6 గంటల నుంచి స్వామి వారికి మల్లెపూలతో సహస్రనామ పూజ నిర్వహించారు.

హనుమాన్ శోభాయాత్ర..

విశ్వహిందూ పరిషత్ ఏలూరు శాఖ, నగరంలోని హిందూ సంఘాల ఆధ్వర్యంలో హనుమద్ జయంతి సందర్భంగా ఆదివారం శ్రీ హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు స్థానిక అల్లూరి సీతారామ రాజు స్టేడియం ఎదురుగా ఉన్న మోతే వారి స్థలం నుంచి ఈ యాత్ర ప్రారంభమయింది. శోభాయాత్ర బైక్ ర్యాలీని తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి జెండా ఊపి ప్రారంభించగా బైక్ ర్యాలీ పాత బస్టాండ్, ఫైర్ స్టేషన్ మీదుగా పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సుమారు తొమ్మిది కిలోమీటర్ల మేర సాగి చివరకు ఏఎస్ఆర్ స్టేడియం వద్దకు చేరుకుంది. హనుమాన్ భక్తులు వేలాదిగా తరలి వచ్చి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వివేకానంద కేంద్ర, కన్యాకుమారి తెలుగు రాష్ట్రాల సంపర్క ప్రముఖ్ సీవీ సదాశివరావు, ప్రముఖ వ్యాపారవేత్త నారా శేషు, విశ్వహిందూ పరిషత్ క్షేత్ర, నిధి, విధి ప్రముఖ్ కస్తూరి సూర్య ప్రకాశరావు, శోభాయాత్ర కన్వీనర్ విజయ్, శోభాయాత్ర కో కన్వీనర్ నడపన దాన భాస్కరరావు, కే కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

108 మామిడి పండ్లతో పూజ

స్థానిక పవర్‌పేట శ్రీ కోదండ రామస్వామి దేవస్థానంలో హనుమద్ జయంతి సందర్భంగా ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం , తమలపాకుల పూజ, గంధసింధూర పూజ నిర్వహించారు. అనంతరం స్వామి వారికి 108 మామిడి పండ్లతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు నారాయణం కోదండ రామాచార్యులు, లక్ష్మణ రంగసాయి ఫణి కుమార్ విశేష పూజలు నిర్వహించగా ఆలయ చైర్మన్ జవ్వాజి మోహన్ విఠల్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	46
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	05-07
బెండకాయలు	24	కంద	72
పచ్చిమిర్చి	48-56	బీట్‌రూట్	36
కాకర కాయలు	40-44	కీరా దోస	40
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	44	అల్లం	220
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	34	పాలకూర	08-12
దొండకాయలు	26	చుక్కకూర	08-12
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	16	బఠాణి	--
అనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	72
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	09
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	09
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	15
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	18

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	04
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	07
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	03
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	04
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	06
ఏలూరు – బీహెచ్ఈఎల్	22.15	34820	08
ఏలూరు –బీహెచ్ఈఎల్	09.00	4794	32
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	33
ఏలూరు –తిరుపతి	16.00	4830	30

టూ వీలర్ మెకానిక్‌లకు కార్మిక చట్టం వర్తింపజేయాలి



టూ వీలర్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ధర్మారావును సత్కరిస్తున్న ఏలూరు శాఖ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో ఉన్న దాదాపు 10 లక్షల మంది టూ వీలర్ మెకానిక్‌లకు కార్మిక చట్టాలను వర్తింపచేయాలని టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దాయనేని ధర్మారావు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక స్వాగత్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ టూ వీలర్ మెకానిక్‌లకు భవన నిర్మాణ కార్మికులతో సమానమైన హక్కులను కల్పించాలని కోరారు. అలాగే కార్మిక చట్టాల ప్రకారం వారికి ఇన్సూరెన్స్ సౌకర్యంతో పాటు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఏలూరు నగర అధ్యక్షుడు పితాని నాగరాజు మాట్లాడుతూ ఏలూరు నగరంలోని టూ వీలర్ మెకానిక్‌లు గతంలో కృష్ణా కెనాల్ కాలువ గట్టు వెంబడి అనేక దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగించేవారని, అప్పటి నాయకులు వాటిని తొలగించడంతో ఉపాధికి దూరమయ్యారన్నారు. దుకాణాలు తొలగించడం వల్ల ఉపాధికి దూరమైన వారందరికీ నగరంలో దుకాణాలు కేటాయించాలని, అలాగే ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందుతున్న ఆధునిక ద్విచక్ర వాహనాల మెకానిజంలో ప్రభుత్వం ఉచితంగా శిక్షణ ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నగర గౌరవాధ్యక్షుడు నేరెళ్ళ రాజేంద్ర, టీవీఎస్ షోరూం శ్రీను, అసోసియేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ ఆసిఫ్ అలీ తదితరులను ఏలూరు అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డెక్కత జయరామ్ రెడ్డి, ఏలూరు కార్యదర్శి ఎం. త్రినాథ్, ఉపాధ్యక్షుడు ఎస్‌కే భాషా, కోశాధికారి పోలిశెట్టి సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి కుంచెం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సవతి తల్లిపై బాలుడి ఫిర్యాదు

ఏలూరు టౌన్: స్నేహితుడి పుట్టిన రోజు ఫంక్షన్‌కు వెళ్లనివ్వడం లేదని ఓ బాలుడు ఆదివారం టవల్‌తో పోలీస్ స్టేషన్‌కు రావడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఏలూరులోని కొత్తపేటకు చెందిన పదేళ్ల సాయిదినేష్ తల్లిదండ్రులతో కలిసి జీవిస్తున్నాడు. బాలుడు తల్లి రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. తండ్రి మరో వివాహం చేసుకుని మొదటి భార్య సంతానంతో కలిపి జీవిస్తున్నాడు. ఆదివారం సాయిదినేష్ స్నానం చేసి మారుడి తల్లిని బీరువాలోని తెల్లచొక్కా ఇవ్వాలని అడిగాడు. స్నేహితుడి పుట్టిన రోజుకు వెళ్ళాలని త్వరగా ఇవ్వాలని మరోసారి అడిగినా పట్టించుకోలేదు. బయటకు వెళ్ళవద్దంటూ గట్టిగా హెచ్చరించింది. మారం చేస్తుండగా ఆమె బాలుడిని కొట్టింది. దీంతో చొక్కా వేసుకోకుండానే టవల్‌తోనే నేరుగా ఏలూరు టూటౌన్ స్టేషన్‌కు వచ్చి సవతి తల్లిపై ఫిర్యాదు చేశాడు. సీఐ చంద్రశేఖర్ తల్లిదండ్రిని పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. బాలుడికి సైతం తల్లిదండ్రి మాట వినాలని మంచిగా చదువుకోవాలని హితవుపలికారు. అయితే గతేడాది దినేష్‌కు సవతి తల్లి వాతలు పెట్టడంతో ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు కూడా నమోదు చేశారు.

బాధితులకు పరామర్శ

ఏలూరు రూరల్: అప్పుల విషయంపై తండ్రి, కొడుకు తగాదా పడి, పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కొడుకు మృతి చెందగా, తండ్రి అపస్మారక స్థితిలో చేరారు. ఆదివారం పూళ్ల శివారు సాయన్నపాలేనికి చెందిన తండ్రి యారపుత్తూరు నాగరాజుతో కొడుకు సత్యనారాయణ (35) అప్పుల విషయం తగాదా పడ్డారు. ఒకరినొకరు దూషించుకుంటూ క్షణికావేశంతో ఇంటి వద్దనే ఉన్న పురుగుల మందు ఒకరి తర్వాత ఒకరు తాగారు. ఏలూరు ఆర్డీఓ పెంచల కిషోర్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరిన వైద్యసేవలు పరిశీలించారు.

రజకుల అభ్యున్నతికి కృషి

రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ రంగన్న



గొల్లగూడెంలో రజక చెరువు వద్ద ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రజక రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ రంగన్న

ఉంగుటూరు: రజకుల అభ్యున్నతికి కృషి చేస్తూ, కులానికి వన్నె తెచ్చేవిధంగా పనిచేస్తున్నానని రజక కార్పొరేషన్ రాష్ట్ర చైర్మెన్ మీసాల రంగన్న అన్నారు. ఆదివారం ఉంగుటూరు మండలం గొల్లగూడెంలో రజక సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన చిట్యాల ఐలమ్మ (చాకలి ఐలమ్మ) విగ్రహాన్ని రంగన్న ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు అఖిల భారత దోబీ మహాసంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జొన్నాడు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సభలో రంగన్న మాట్లాడుతూ ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకుని రజకులు చైతన్య వంతులుగా మెలగాలని కోరారు. గ్రామాల్లో రజక చెరువులు అన్యాక్రాంతం కాకుండా పాలకులు చర్యలు తీసుకోవాలన్నారు. 18 రాష్ట్రాల్లో అమలవుతున్న మాదిరిగా మన రాష్ట్రంలో రజకులను ఎస్సీ కేటగిరీలో చేర్చే విషయంపై సీఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. విగ్రహ దాత వేములపల్లి సుధీర్ మాట్లాడుతూ గ్రామంలో అన్ని వర్గాల ప్రజలు సోదర భావంతో కలిసి మెలిసి ఉంటామన్నారు. సమావేశంలో రాష్ట్ర చైర్మన్ రంగన్నను స్థానిక రజక సంఘం పెద్దలు శాలువా కప్పి సత్కరించారు. విగ్రహదాత సుధీర్‌ను చైర్మన్ శాలువా కప్పి సత్కరించారు. సమావేశంలో దోభీ మహా సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు చింతాడ శ్రీనివాసు, కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు రేవూరి గోగురాజు, ఈగలపాటి యువశ్రీలు, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లె శ్రీఅములు, రజక చైతన్యసేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కాకినాడ రామారావు, నవ్యాంధ్ర రాష్ట్ర రజక సంఘ అధ్యక్షుడు అద్దాల నరసింహారావు, బహుజన కులాల ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షులు చింతపల్లి గురుప్రసాదు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి నడిపూడి నానగబాబు, వెలుదుర్తి శ్రీనివాసు, రజక సంఘ నాయకులు ఊనగట్ల నాగపోసి కృష్ణ, రాజమహేంద్రవరపు లక్ష్మణ రావు, యండమూరి మహేష్, అంజూరి శ్రీనివాసు, కొండపల్లి దుర్గారావు , స్థానిక వీదులమ్మ తల్లి రజక సేవా సంఘం అధ్యక్షుడు పల్లంట్ల రాంబాబు, కార్యదర్శి ప్రసాదు, వైఎస్సార్ సీపీ నేత నాగు తదితరులు పాల్గొన్నారు.